క్లుప్తంగా

విద్యార్థులకు సత్కారం

నందిగామరూరల్: జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఐతవరం పాఠశాల విద్యార్థులు ఎంపికకావడం అభినందనీయమని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్కాలర్ షిప్‌కు ఎంపికైన ఐతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదోతరగతి విద్యార్థులు బెల్లంకొండ జయశ్రీలక్ష్మి, జినమోని వికాస్ కుమార్, యార్లగడ్డ భార్గవ్‌లను శుక్రవారం ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యేలా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు బండారు లక్ష్మీనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ బెల్లంకొండ అమరయ్య, నాయకులు వీరంకి వీరాస్వామి, తొగటి హనుమయ్య, మద్దుకూరు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



నందిగామరూరల్: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చందాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు తెలుగుతల్లి, సంప్రదాయ వేషధారణలో ప్రత్యేకాకర్షణగా నిలిచారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మాతృభాషను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. అనంతరం మాతృభాష ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా నందిగామ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట):ఏపీ నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కథనం మేరకు.. వత్సవాయి మండలం కన్నెవీడు ఇసుక క్వారీ నుంచి రెండు ట్రాక్టర్లు చిల్లకల్లు, జగ్గయ్యపేట, ముక్త్యాల మీదుగా తెలంగాణలోని మేళ్లచెరువుకు వెళ్తుండగా ముక్త్యాల చెక్‌పోస్టు వద్ద పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి



వీరులపాడు: తల్లిదండ్రులు మందలించారనే కోపంతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది.పోలీసుల కథనం మేరకు.. చెడువ్యసనాలకు బానిసైన మండలంలోని తాటిగుమ్మి గ్రామానికి చెందిన కురగంటి బూసియ్య పెద్దకుమారుడు వంశీ (23)ని ఈనెల 16వతేదీ సాయంత్రం తల్లిదండ్రులు మందలించటంతో మనస్తాపం చెందాడు. అనంతరం యువకుడు వెల్లంకి గ్రామ శివారులో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించటంతో వారు అతన్ని హుటాహుటిన 108 ద్వారా విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వంశీ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి బూసియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

50గ్రాముల బంగారం చోరీ

నందిగామటౌన్(నందిగామ రూరల్): నందిగామలో పట్టపగలు గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని నెహ్రూనగర్‌లో నివాసముంటున్న మునిరెడ్డి, బాలశౌరి ఇళ్ల తాళాలు వేసి ఉండటంతో శుక్రవారం మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఇళ్లలోకి ప్రవేశించారు. బీరువాలను పగలగొట్టి సుమారు 50 గ్రాముల బంగారం, రూ. 30 వేల నగదు చోరీకి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. బాధితుల సమాచారం మేరకు సీఐ వైవిఎల్ నాయుడు ఆయా ఇళ్లను పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించినట్లు సీఐ తెలిపారు. రైతుబజార్ సమీపంలో తోపుడుబండిపై కూరగాయలు, పండ్లు విక్రయించుకుని జీవనం సాగిస్తున్న వెంకట్రావమ్మ వద్ద ఉన్న డబ్బుల సంచిని ఓవ్యక్తి అపహరించి పరారయ్యాడు. పండ్లు కొనే నెపంతో వచ్చి సంచిని అపహరించాడని, సంచిలో రూ.1500 నగదుతోపాటు ఆధార్, రేషన్ కార్డు ఉన్నట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చోరీ ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు కంట్లో కారం

- భారీగా పడిపోయిన మిర్చి ధరలు
- చోద్యంచూస్తున్న కూటమి ప్రభుత్వం
- ఇప్పటికే కోల్డ్‌స్టోరేజీల్లో పేరుకుపోయిన మిర్చి నిల్వలు
- గిట్టుబాటు ధర కోసం రైతుల వేడుకోలు



పెనుగంచిప్రోలులో మిర్చి కల్లంలో రైతు రామయ్య

పెనుగంచిప్రోలు: 'నాపేరు గంధం రామయ్య...పెనుగంచిప్రోలు గ్రామం. మూడెకరాల్లో తేజ రకం మిర్చి సాగు చేశాను...ఈ ఏడాది దిగుబడి తక్కువగారావటంతోపాటు ధర కూడా బాగా తగ్గింది. క్వింటా రూ.12వేల నుంచి రూ.13వేల లోపు అడుగుతున్నారు...ఎకరాకి కౌలు రూ.20 వేలు, కోత కూలీలు రూ.70వేలు పైన అవుతోంది... తాలు కాయలు ఏరించి, టిక్కీల్లో తొక్కించి అమ్మకానికి సిద్ధం చేయడానికి మరో రూ.1500 ఖర్చు అవుతోంది... దీంతో ఎకరానికి రూ.2లక్షల వరకు పెట్టుబడి అయింది...గతేడాది ఇదే సమయంలో క్వింటా రూ.21వేల నుంచి రూ.25 వేల వరకు పలికిన మిర్చిధర ఈ ఏడాది మాత్రం నేలచూపులు చూస్తోంది... దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కూడా లేదు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు' ఇది ఈ ఏడాది మిర్చిసాగు రైతుల దీనావస్థ. మార్కెట్‌లో ఆశించినంత ధర లేకపోవటంతో పెట్టుబడులు కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించకపోతుండంపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఇప్పటికే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచిన వారి పరిస్థితి మరింత అగమ్యగోచరంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మిర్చి రైతులకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. పంట చేతికొచ్చిన తరుణంలో గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్నారు. తక్కువ ధరకు విక్రయించలేక కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తున్నారు. అదనపు భారం అని తెలిసినా నిల్వ చేసేందుకే మొగ్గు చూపుతున్నారు.

భారీగా మిర్చి సాగు..

జిల్లాలో ఈఏడాది 40 వేల ఎకరాల వరకు మిర్చి సాగు చేయగా, అందులో జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల్లో మిర్చి సాగు ఎక్కువగా ఉంది. ప్రస్తుతం మిర్చి బెస్ట్ క్వాలిటీ తేజ రకాలు క్వింటా ధర రూ.13వేలు లోపు ఉండగా, మిగిలినవి రూ.11వేల లోపే పలుకుతున్నాయి. సీడ్ రకాలు అయితే రూ.10వేలు లోపు మాత్రమే ఉన్నాయని రైతులు చెబుతున్నారు. గతేడాది ఇదే సమయంలో క్వింటా మిర్చి రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు పలుకగా, , ఈఏడాది అందులో సగానికి మించి ధరలేకపోవడం రైతులను కుంగదీస్తోంది. వాస్తవానికి క్వింటా కాయలు కోయటానిక కోత కూలే రూ.5వేలు అవుతోందని, తాలు కాయ ఏరించి టిక్కీల్లో తొక్కించి, అమ్మకానికి సిద్ధం చేసేందుకు మరో రూ.1500 ఖర్చు అవుతుంది. అంటే క్వింటాకు సుమారు రూ.6,500 వరకు ఖర్చు అవుతుండగా, రూ.10వేలు, రూ.11వేలు ధర ఉంటే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు కనిపించడంలేదని రైతులు వాపోతున్నారు.



అనిగండ్లపాడు నుంచి ఖమ్మం కోల్డ్‌స్టోరేజీకి మిర్చి టిక్కీలు తరలిస్తున్న రైతు

దిగుబడులకు తెగుళ్ల దెబ్బ..

మిర్చి సాగుకు గతంతో పోలిస్తే పెట్టుబడులు కూడా బాగా పెరిగాయి. ఎకరానికి పెట్టుబడి కౌలుతో కలుసుకుని రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు అవుతోంది. తెగుళ్ల కారణంగా దిగుబడులు కూడా బాగా తగ్గాయి. ఎకరానికి 15 క్వింటాళ్ల మించి దిగుబడి రావడం లేదని రైతులు చెబుతున్నారు. ఒకవైపు దిగుబడులు రాక, మరోవైపు ధర లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

నిల్వ చేసేందుకే రైతులు మొగ్గు....

ప్రస్తుతం మార్కెట్‌లో మిర్చికి తగిన ధర లభించకపోతుండటంతో రైతులు మిర్చిని కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వచేసేందుకే మొగ్గుచూపుతున్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో 11కోల్డ్ స్టోరేజీలు ఉండగా, సమీపంలోని తెలంగాణకు చెందిన మధిర, బోనకల్, ఖమ్మం ప్రాంతాల్లోనూ కూడా కోల్డ్‌స్టోరేజీలు ఉన్నాయి. రైతులు వారి వెసులుబాటు ప్రకారం మిర్చిని ఆయా కోల్డ్‌స్టోరేజీలకు తరలిస్తున్నారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని కోల్డ్‌స్టోరేజీల్లో సుమారుగా 9లక్షల టిక్కీల వరకు నిల్వ చేసే అవకాశం ఉంది. గతేడాది నిల్వ చేసిన పంట ఇంకా కోల్డ్‌స్టోరేజీల్లో 40 నుంచి 50 శాతం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. . ప్రస్తుతం ఉన్న ధరకు పాత కాయను, కొత్తకాయను అమ్ముకోలేక కోల్డ్‌స్టోరేజీల్లో ఉంచేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు.

రైతులపై అదనపు భారం..

కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచితే ఒక్కో టిక్కీకి ఎగుమతి, దిగుమతితో కలిపి రూ.250 ల వరకు రైతుకు అదనంగా ఖర్చు అవుతుంది. రైతులందరూ నిల్వ ఉంచేందుకే ప్రాధాన్యం ఇస్తుండటంతో కోల్డ్‌స్టోరేజీలు కూడా నిండిపోయే పరిస్థితి ఉంది. ధరలు సరిగాలేనందునే మిర్చిని కోల్డ్‌స్టోరేజీల్లో ఉంచాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మిర్చి ధర గతేడాది మాదిరి ఇప్పుడు కూడా ఉండి ఉంటే గట్టెక్కేవాళ్లమని, కాని ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోతుండటంతో నష్టపోతున్నామని మిర్చి సాగు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి మిర్చికి తగిన మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతు కష్టం వృధా...



గతేడాది ఎండు మిర్చి క్వింటా ధర రూ.25 వేలు పలికింది. ఈసారి రూ.13 వేలు కూడా పలకటం లేదు. మద్దతు ధర లేకపోవడంతో లక్షలాది రూపాయలు పెట్టుబడితోపాటు రైతు కష్టం వృధాగా పోతోంది. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర కల్పించాలి.

– లగడపాటి సురేష్, రైతు, శివాపురం

రైతులను ఆదుకోవాలి



మిర్చి ధర పతనంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారు. రాష్ట్రప్రభుత్వం మార్క్‌ఫెడ్, ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా మిర్చి కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలి. మిర్చికి మద్దతు ధర లభించి రైతులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ వారి కోసం పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది.

–ఏలూరి శివాజీ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, శివాపురం

ధ్వజస్తంభ ప్రతిష్ఠ



చందర్లపాడు(నందిగామరూరల్):చందర్లపాడు మండలం తోటరావులపాడులోని మౌలాలి నాగుల్‌మీరాస్వామి వారి దర్గా ధ్వజస్తంభ పునఃబల ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా మౌలాలి నాగుల్‌మీరాస్వామి వారి గ్రామసేవను కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులను మాజీఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ములకలపల్లి లక్ష్మి, నాయకులు ములకలపల్లి కృష్ణమోహన్, నాసరయ్య, సయ్యద్ లాలాసాహెబ్, దొంతిరెడ్డి నాగిరెడ్డి, నెక్కంటి సత్యనారాయణరెడ్డి, కమ్మా వెంకట్రావ్, నాయకులు పాల్గొన్నారు.

ఖైదీలకు టీబీపై అవగాహన

నందిగామటౌన్(నందిగామ రూరల్): టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా టీబీ అధికారి ఉషారాణి సూచించారు. జిల్లా టీబీ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో స్థానిక సబ్‌జైలులోని ఖైదీలకు శుక్రవారం ఆమె క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బరువు తగ్గటం, రెండు వారాలకు పైబడి దగ్గు, కళ్లెలో రక్తపు జీరలు కనబడుట, రాత్రివేళ జ్వరం, చమటలు పట్టడం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. అనంతరం టీబీ నియంత్రణ పోస్టర్‌ను ఆవిష్కరించి ఖైదీలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ సీతారామారావు, వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లను తగ్గించేందుకు కుట్ర

తన్నీరు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన నాయకులు, దివ్యాంగులు

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రంలో దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ల సంఖ్యను తగ్గించేందుకే రీ వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో నిర్వహిస్తున్న దివ్యాంగుల రీ వెరిఫికేషన్ క్యాంపును పరిశీలించారు. క్యాంపునకు వచ్చిన జగ్గయ్యపేట మండలంలోని బలుసుపాడు, అన్నవరం గ్రామాలకు చెందిన దివ్యాంగులకు ఆయన బిస్కెట్లు, పండ్లు పంపిణీచేశారు. క్యాంపునకు వచ్చే దివ్యాంగులకు కనీసవసతులు కల్పించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగులను రీవెరిఫికేషన్ ప్రక్రియ పేరుతో ప్రభుత్వాసుపత్రుల చుట్టూ తిప్పుతూ రాష్ట్రప్రభుత్వం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతిస్తోందన్నారు. రాష్ట్రంలో 2లక్షల పింఛన్లను తగ్గించేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దివ్యాంగులతో మానవతా దృక్పథంతో వ్యవహరించి ఎవ్వరి పింఛన్లను తొలగించలేదని గుర్తుచేశారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ దివ్యాంగుల పింఛన్లను తగ్గించేందుకు యత్నిస్తుండటం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ దివ్యాంగుల సంఘం నియోజకవర్గ కన్వీనర్ పూర్ణకంటి బాబురావు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, కార్మిక విభాగం, ప్రచార విభాగాల అధ్యక్షులు గంగోలు వినోద్, గోగుల వెంకయ్య, బలుసుపాడు సర్పంచ్ సూరిబాబు, జవ్వాది నరసింహారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహరెడ్డి, మన్నె అప్పారావు, దివ్యాంగుల సంఘం నియోజకవర్గ కార్యదర్శి గోనె విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడు కొండపల్లి కోటేశ్వరరావు, సంఘ బలుసుపాడు అధ్యక్షుడు బండ్ల జయరాజు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



కంచికచర్ల : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వీవర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తంగెళ్లమూడి రామారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడుగా నియతులైన మార్త శ్రీనివాసరావు శుక్రవారం నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వారిని మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు అభినందించి సత్కరించారు. పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని సూచించారు. తంగెళ్లమూడి రామారావు, మార్త శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించారంటూ మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

అగ్రహారం బ్రిడ్జి పరిశీలన

జగ్గయ్యపేటఅర్బన్: ఇటీవల వరదలకు దెబ్బతిన్న అగ్రహారం బ్రిడ్జి మరమ్మతు పనులు పూర్తయినట్లు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. పలువురు కౌన్సిలర్లతో కలసి శుక్రవారం ఆయన బ్రిడ్జిని పరిశీలించారు. కేసీపీ సిమెంట్స్ వారి సీఎస్సార్ నిధులతో బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టినట్లు వివరించారు. బ్రిడ్జికి ఇరువైపులా ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సిలువగిరి మహోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

నందిగామరూరల్: మండలంలోని పల్లగిరిలో పరిశుద్ధ సిలువగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాలలో భాగంగా పరిశుద్ధ పుణ్యక్షేత్రంలో ఫాదర్ ఫిలోమెన్ రాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన క్రీస్తు సందేశాన్ని అందించారు. ఏసుక్రీస్తు చూపిన మార్గం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. తొలుత క్రీస్తు సువార్త ప్రార్థనలు, సమిష్టి దివ్య బలిపూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ విస్తరణ కార్యక్రమం

గరికపాడు(జగ్గయ్యపేట):రైతులకు పంటల్లో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కేవీకె ప్రధాన శాస్త్రవేత్త కృష్ణంరాజు సూచించారు. కేవీకేలో శుక్రవారం వ్యవసాయ విస్తరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త కృష్ణంరాజు మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, మిర్చి పంటల్లో చీడపీడ దల ఉధృతి అధికంగా ఉందన్నారు. వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, మైలవరం మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

బత్తుల రామారావుకు సత్కారం



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బత్తుల రామారావును స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో మరింత చురుకుగా పనిచేయాలని రామారావుకు సూచించారు. బత్తుల రామారావు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావుకు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వైవీ.సుబ్బారెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుపై న్యాయవాదుల నిరసన



నందిగామ కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నందిగామటౌన్(నందిగామరూరల్): న్యాయవాద వ్యవస్థ, న్యాయవాద వృత్తిని అగౌరవపరిచేలా ఉన్న చట్టాలను వెంటనే రద్దు చేయాలని నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నండ్రు బాబు విద్యాసాగర్ డిమాండ్ చేశారు. న్యాయవాదుల చట్టం–1961లో గణనీయమైన మార్పులకు ప్రతిపాదిస్తూ కేంద్ర న్యాయ వ్యవహారాలశాఖ రూపొందించిన న్యాయవాదుల బిల్లు–2025ను వ్యతిరేకిస్తూ న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ న్యాయశాఖ చేసిన సవరణలోని అంశాలతో న్యాయ వ్యవస్థకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. అంతేకాకుండా భవిష్యత్ తరాల మనుగడ కష్టతరమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర న్యాయశాఖ స్పందించి సవరణ అంశాలపై పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొరగంటి కృష్ణంరాజు, అద్దంకి మణిబాబు, కన్నెకంటి జీవరత్నం, నండ్రు శ్రీరామ్మూర్తి, మన్నెం నారాయణరావు, షేక్ సైదా, బొందలపాటి రామకృష్ణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: భారత ప్రభుత్వం అమలుచేయదలచిన అడ్వకేట్స్ (అమెండమెంట్స్) యాక్టు–2025ను నిరసిస్తూ జగ్గయ్యపేటలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు. అత్యంత దుర్మార్గకరమైన ఈ చట్టం అమలును అడ్డుకుంటామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు ధనుంజయుడు, వెంకట్రామయ్య, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, మధు, కృష్ణయ్య, ఆంజనేయులు, సంతోష్, నాగరాజు, బిక్షమయ్య, అంకమరాజు, ప్రతాపరెడ్డి, మురళి, ప్రసాద్, రవి, రాజశేఖర్, రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల ఏర్పాట్లు పరిశీలన



ముక్త్యాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీ రమేష్‌బాబు

ముక్త్యాల(జగ్గయ్యపేట): ఈనెల 23 నుంచి ప్రారంభమయ్యే భవానీ ముక్తేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు సూచించారు. ముక్తేశ్వరస్వామి వారి ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కోటిలింగ హరిహర మహా క్షేత్రాన్ని సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. ఆలయ ఈవో సురేష్‌బాబు, ఏసీ సీతారామయ్య, కోటిలింగాల, పెద్దా రామాలయం ఈవోలు హరిదుర్గానాగేశ్వరరావు, ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కూడలి సంగమేశ్వర ఆలయంలో..

నందిగామరూరల్: దాములూరు కూడలిలో వేంచేసియున్న సంగమేశ్వరస్వామి వారి ఆలయంలో సాగుతున్న శివరాత్రి ఏర్పాట్లను శుక్రవారం రాత్రి డీసీ రమేష్‌బాబు పరిశీలించారు. తొలుత ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా నందిగామలోని రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏసీ సీతారామయ్య, ఆలయ ఈఓ నరసింహమూర్తి పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి



పైపులైన్ లీకేజీలను పరిశీలిస్తున్న వట్టెం మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో చాలాచోట్ల తాగునీటి పైపులు మురుగు కాలువలపై ఉండటంతో లీకేజీకి గురై తాగునీరు కలుషితమవుతోందని మున్సిపల్ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని పైపులైన్ల లీకేజీలను శుక్రవారం పరిశీలించారు. సీతారామపురం 4వవార్డుతోపాటు పట్టణంలో పలు చోట్ల మురుగు కాలువల్లో ఉన్న పైపులైన్లు లీకేజీలకు గురయ్యాయని వివరించారు. ఆ నీరు తాగుతున్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే ప్రజలు మరింత ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తుతుందన్నారు. ఇకనైనా మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి పైపులైన్ల లీకేజీలను సరి చేయాలని కోరారు. మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యుడు చౌడవరపు జగదీష్, వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్ పాల్గొన్నారు.

చోరీకి గురైన ఇల్లు పరిశీలన

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని విష్ణుప్రియనగర్‌లో ఈనెల 19వ తేదీన చోరీ జరిగిన డాక్యుమెంట్ రైటర్ ప్రసాద్ ఇంటిని పేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శుక్రవారం పరిశీలించారు. ఈ సంఘటనపై ఏసీపీ రాజశేఖరబాబు, నందిగామ ఏసీపీ తిలక్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. చోరీకి గురైన సొమ్ము రికవరీ అయ్యేలా చూస్తామంటూ బాధితుడు ప్రసాద్‌కు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు వెంకట్రావు, గొట్టె నాగరాజు, సైదేశ్వరరావు, వెంకట్, నాయకులు కనపర్తి సత్యనారాయణప్రసాద్, గుత్తికొండ శ్రీనివాసరావు, మల్లెల కొండ, కృష్ణ, రామకృష్ణ, నరసింహారావు ఉన్నారు.